ఆదివారం 23, జూన్ 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాలి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

# కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరం: ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 22: కల్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్ పేట ఎస్ఆర్జీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని 156 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట ఎమ్మార్వో మీరాబాయి, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్ రెడ్డి, వై. అమృత తదితరులు ఉన్నారు.





అధికారులు ఎక్కువ చేస్తే బదిలీలు ఉండవు.. ఇక డైరెక్ట్‌గా రిమూవ్ చేయడమే : పొంగులేటి 2లో



ఏడు డిమాండ్లతో సీఎం రేవంత్‌రెడ్డికి.... హరీశ్‌రావు లెటర్ 2లో



ప్రియాంక గాంధీకి మద్దతుగా.. వయనాడ్‌లో బెంగాల్ సీఎం ప్రచారం..! 3లో



భారత పర్యటనలో బంగ్లాదేశ్ ప్రధాని.. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య చర్చ 3లో

## తెలంగాణ అభివృద్ధికి

# చంద్రబాబుతో పోటీ పడతా

## సీఎం రేవంత్ రెడ్డి కామెంట్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హెల్త్ టూరిజం హబ్ 500 నుంచి 1000 ఎకరాల్లో విస్తరించి దానికి అనుగుణంగా బ్లూ ప్రింట్ సేకరించనున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన వాటితో పోటీపడి ఈ హబ్‌లో అన్ని వ్యాధులకు నాణ్యమైన చికిత్స అందించాలనే ఆలోచన ఉంది. హబ్‌లో తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అన్ని అగ్రశ్రేణి సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి శనివారం ఇక్కడ తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవ వేడుకలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మధ్యప్రాచ్య దేశాల నుంచి అనేక మంది రోగులు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని అన్నారు. చికిత్స కోసం నగరానికి వచ్చే ప్రజలకు వసతి కల్పించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే అన్ని ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి యాజమాన్యం తమ సేవల విస్తరణ కోసం అదనపు స్థలాన్ని కోరింది. ప్రతిపాదిత హెల్త్ టూరిజం హబ్‌లో బసవతారకం ఆసుపత్రికి కూడా స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఆసుపత్రి అందిస్తున్న సేవలను గుర్తు చేస్తూ.. లీజు వ్యవధి, ఇతర అనుమతుల సమస్యలను యాజమాన్యం తన దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే మంత్రివర్గంలో క్లియర్ చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఏ రంగంలో నైనా రాణించాలంటే ఉత్తములతో పోటీపడాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు: " ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్ చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి, సంక్షేమం , అభివృద్ధిలో , తెలంగాణ అభివృద్ధిలో ఆయనతో పోటీపడే అవకాశం నాకు లభించింది. ," "ఇంతకుముందు, నేను 12 గంటలు పని చేస్తే సరిపోతుందని నేను అనుకున్నాను, కాని చంద్రబాబు నాయుడు 18 గంటలు పని చేస్తాడు , మేము విశ్రాంతి తీసుకోలేము. మా అధికారులు, టీమ్ మొత్తం 18 గంటల పాటు పని చేయాలని, సంక్షేమం, అభివృద్ధిలో ఉభయ తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రి 25వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా బసవతారకం హాస్పిటల్ ఛైర్మన్ ఎన్ బాలకృష్ణ నన్ను ఆహ్వానించారని, 30వ వార్షికోత్సవ వేడుకల్లో కూడా పాల్గొంటానని హామీ ఇస్తున్నానని తెలిపారు.



# యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం

- బాపునగర్ ప్రగతి విద్యానికేతన్ లో యోగాపై అవగాహన క్యాంపు
- దిన చర్యలో భాగం చేసుకుంటామని విద్యార్థుల ప్రతిజ్ఞ



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 22: యోగా సాధన ద్వారా ఆరోగ్యంతో పాటు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని యోగాసన భారత్ జాతీయ కార్యదర్శి , తెలంగాణ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ అన్నారు. పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం అంబర్ పేట డివిజన్ బాపునగర్ ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్లో ప్రత్యేక యోగా అవగాహన శిబిరం నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ఇండియన్ యోగ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిడ్జిభూషణ్ రోహిత్ , పతంజలి యోగ సమితి గ్రేటర్ అధ్యక్షుడు రామనాథం, పతంజలి యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వి. శివుడు.పతంజలి యోగ నార్త్ ఈస్ట్ జోన్ తెలంగాణ అధ్యక్షుడు, దేవేందర్, తెలంగాణ యోగ టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్య రెడ్డి, ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ సాదు మధుసూదన్ తదితరులతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగాను ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. రోజువారి జీవనంలో ఎంతో ఒత్తిడికి గురయ్యే వారికి యోగాసనాలు ఎంతో ఉపశమనం కల్గిస్తాయన్నారు. యోగాతో ఆరోగ్యసమస్యలు పరిష్కరించుకో వచ్చన్నారు. మానవ జీవన విధానంలో యోగా ఒక భాగమైపో యిందని అన్నారు. విద్యార్థులు యోగా సనాలను శ్రద్ధగా నేర్చుకొనేందుకు ప్రతి రోజు సమయాన్ని కేటాయించాలని సూచించారు. ప్రాచీన భారతీయ సంప్రదాయాల నుంచి మనకు లభించిన ఓ అమూల్యమైన కానుక యోగా అన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగా పై దృష్టి సారించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. దైనందిన జీవితంలో యోగా సాధన ద్వారా నిత్య జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు యోగా సాధనల గురించి వివరించి యోగాసనాలు వేయించారు. దిన చర్యలో యోగాను భాగం చేసుకుంటామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ శిబిరంలో స్కూల్ అడ్మిన్ డైరెక్టర్ సాదుల ధనలక్ష్మి, ప్రిన్సిపల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపల్స్ ఫాతిమా, గీత తదితరులు ఉన్నారు.

# కేంద్ర మంత్రివర్గంలో వంజరులకు స్థానం కల్పించాలి

## అఖిల భారత వంజరి సేవా సంఘం డిమాండ్



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 22: కేంద్ర మంత్రివర్గంలో వంజరులకు స్థానం కల్పించాలని, తెలంగాణలో రాష్ట్రంలో వంజరి కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ వంజరి సేవా సంఘం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. శనివారం సికిందరాబాద్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ వంజరి సేవా సంఘం కోర్ కమిటీ సమావేశంలో అఖిలభారత వంజరి సేవా సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ వంజరి మాట్లాడుతూ... 2014లో బిజెపి అధికారంలోకి రావడానికి విశేష కృషి చేసిన దివంగత గోపీనాథ్ ముండే కేంద్ర క్యాబినెట్లో చేరిన 15 రోజులకే మరణించడం జాతీయస్థాయిలో వంజరి సామాజిక వర్గానికి ఎంతో లోటని అన్నారు. తిరిగి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత కేంద్ర క్యాబినెట్ లో ఉన్న డాక్టర్ భగవత్ కిషన్ రావు కరాడ్ వంజరి కి తిరిగి అవకాశం కల్పించకపోవడం బాధాకరమని ఆ లోటును భర్తీ చేయడానికి వంజరి కులస్తులకు కేంద్ర క్యాబినెట్లో చోటు కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఒకే కులం- ఒకే రిజర్వేషన్ విధానం అవలంబించి జాతీయస్థాయిలో వంజరులకు డిఎన్ టీ హోదా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ వంజరి సేవా సంఘం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి దాత్రిక ధర్మరాజు లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వంజరి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి కులంలో ఉన్న బీద కుటుంబాలను ఆదుకోవడానికి ఆర్థికంగా సహకరించాలని డిమాండ్ చేశారు. వంజరి కులస్తులకు ఒక ఎమ్మెల్సీ పదవి నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎదుగని హరినాథ్, పోత్నకు అంజయ్య ఎమికే సూర్యనారాయణ , కార్యదర్శిలు రత్న సంతోష్, ఎదగని రామకృష్ణ, సారంగు సత్యం, తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకుడు కాలేరు సురేష్, వంజరి టుడే ఎడిటర్ కాలేరు రూప సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం కనీస మద్దతు ధర పెంచింది: కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22: వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం కనీస మద్దతు ధర పెంచిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ లో పండించే వరి మద్దతు ధర కూడా పెరిగిందని, పత్తి పంట పై ఒకే సారి 500 పెంచిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యోగాల భర్తీ విషయం లో ఇచ్చిన హామీలను విస్మరిస్తుందని ఆయన మండిపడ్డారు. జాబ్ కాలెండర్ ను అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందని, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లు బహిరంగ సభల్లో మాట్లాడారని, తెలంగాణ తల్లి గా హామీ ఇస్తున్నా అని సోనియా గాంధీ ప్రతి ఇంటికి లేఖ పంపించిందన్నారు. వాళ్ళిచ్చిన గ్యారంటీలకు గ్యారంటీ లేకుండా పోయిందని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థినుల కు స్కూటీలు ఇస్తామన్నారు .. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముందు ధర్నా చేస్తున్న మా యూత్ వింగ్ నేతల పై పోలీస్ లు కక్ష పూరితంగా ఉన్నాయన్నారు. సింగరేణి పై విచిత్ర, వితండ వాదన బీఆర్ఎస్ వినిపిస్తుందని, సింగరేణి నీ ధ్వంసం చేసింది బీఆర్ఎస్ అని ఆయన అన్నారు. దేశం లోనే మంచి ప్రభుత్వ రంగ సంస్థ అని, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుటుంబం సింగరేణి నీ దివాలా తీసే పరిస్థితి అని, సింగరేణి నీ దెబ్బతీయాలని కెసిఆర్ కుటుంబం కంకణం కట్టుకుందన్నారు. ఓపెన్ యాక్షన్ ద్వారా అయితే సింగరేణికి లాభం నామినేషన్ ద్వారా అయితే నష్టమన్నారు కిషన్ రెడ్డి. నీట్ మీద దురుద్దేశం కేంద్రానికి లేదన్నారు. పేపర్ లీకేజ్ కాలేదని, నీట్ విషయం లో విద్యార్థులకు న్యాయం చేస్తామన్నారు. మరింత సమర్థ వంతంగా నిర్వహిస్తామని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య ట్విట్టర్ వార్! సోషల్ మీడియా వేదికగా విమర్శలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూన్ 22: తెలంగాణలో బొగ్గు గనుల వేలంపై సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సోషల్ మీడియాలో వార్ నడుస్తోంది. ఒకరిపై మరొకరు ట్వీట్లతో విమర్శల వర్షం కురిపించుకుంటున్నారు. 2021 రేవంత్ రెడ్డి బొగ్గు గనులను వేలం వేయొద్దు అని కేంద్రానికి రాసిన లేఖను ప్రస్తావిస్తూ కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ లో రేవంత్ రెడ్డి గారూ.. గతంలో బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేఖించిన మీరు ముఖ్యమంత్రి అయ్యాక వేలంలో పాల్గొనడానికి, ప్రచారం చేయడానికి మీ డిప్యూటీ సీఎంను పంపించారని, ఈ బలవంతం వెనుక ఉన్న కారణాలను వివరించగలరా? అని ప్రశ్నించారు. అలాగే గుజరాత్ ,ఒరిస్సాలలోని గనులను వేలం నుంచి మినహాయింపు ఇచ్చి పీఎస్‌యూలకు ప్రత్యక్ష కేటాయింపు చేపట్టారని, తెలంగాణలో కూడా అలా చేయాలని ఎందుకు ప్రశ్నించడం లేదని ట్వీట్ చేశారు. దీనికి రేవంత్ రెడ్డి రిప్లై ఇస్తూ కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. పది సంవత్సరాలు గా కొట్లాది తెలంగాణ ప్రజల మాటలను పట్టించుకోని మీరు ఇప్పుడు వాస్తవాలను వినడానికి శ్రద్ధ చూపరని మండిపడ్డారు. అలాగే గతంలో అరబిందో, అవంతిక కంపెనీలకు కేటాయించేటప్పుడు వ్యతిరేఖంగా మాట్లడలేదని, మా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారు దానిని వ్యతిరేఖించడమే కాకుండా మీ ప్రియమైన కంపెనీలకు విక్రయించిన బొగ్గు బ్లాకును రద్దు చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. అంతేగాక సింగరేణి, ఓఆర్ఆర్ కలెక్షన్ హక్కులను అమ్మినప్పుడు చనిపోయిన వ్యక్తి ఇప్పుడు మాట్లాడుతున్నాడని వ్యంగ్యాస్త్రాలు కురిపించారు. రేవంత్ రెడ్డి ట్వీట్ కు కేటీఆర్ కౌంటర్ ఇస్తూ.. మీ అబద్ధపు ప్రచారానికి సమాధిలో ఉన్న గోబెల్స్ ఉలిక్కిపడుతున్నాడని, బొగ్గు బ్లాకుల అమ్మకాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎప్పటినుండో వ్యతిరేఖిస్తుందని, మీ లాగా ప్రత్యక్షంగా వేలంలో పాల్గొనలేదని విమర్శలు చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర నదీప్రాంత హక్కులను కాపడడంలో కాంగ్రెస్ ఎలా విఫలమైందో ప్రజలు ఇప్పటికే చూశారని, బొగ్గుగనుల విషయంలో బీజేపీకి మీ సహకారం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపణలు చేశారు. అంతేగాక గనులను వేలం వేయడానికి భట్టిగారు, కిషన్ రెడ్డిగారు వేదికను పంచుకోవడం చరిత్ర మర్చిపోదు అని, రెండు జాతీయ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

## కిసాన్ న్యాయ్‌కు కట్టుబడి ఉన్నాం: మల్లికార్జున ఖర్గే



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూన్ 22: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. రైతులపై మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలతో వేధిస్తే.. కాంగ్రెస్ కిసాన్ న్యాయ్ కు కట్టుబడి ఉందన్నారు. రైతు రుణమాఫీ పై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రియాక్ట్ అయిన ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. తెలంగాణలోని 40 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రుణమాఫీ చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మల్లికార్జున ఖర్గే హర్షం వ్యక్తం చేశారు. ఇక, 16 సంవత్సరాల క్రితం, కాంగ్రెస్-యూపీఏ ప్రభుత్వం 3.73 కోట్ల మంది రైతులకు సంబంధించిన 72 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలు, వడ్డీలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాఫీ చేశామని గుర్తు చేశారు. ఒక వైపు మోడీ ప్రభుత్వం దేశంలోని రైతులపై మూడు నల్ల చట్టాలను విధించి, ముళ్ల తీగలు, డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు, లాఠీ దెబ్బలతో వేధిస్తుంటే.. మరోవైపు కాంగ్రెస్ పార్టీ "కిసాన్ న్యాయ్" కింద సరసమైన ధరలు, రుణమాఫీ కమిషన్, బీమా చెల్లింపుల ప్రత్యక్ష బదిలీ లాంటి న్యాయమైన వ్యవసాయ దిగుమతి- ఎగుమతి పాలసీకి హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. మా ఈ ఎజెండా చెక్కు చెదరకుండా ఉంటుందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

మిగతా..

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/



## ఏపీ అసెంబ్లీలో ...పవన్ కల్యాణ్ తొలి ప్రసంగం...



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 22: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎ పవన్ కల్యాణ్ సహా పలువురు కూటమి సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అయ్యన్నపాత్రుడు చాలా సీనియర్ నేత అని, రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగిన నేత సభాపతి స్థానంలో కూర్చోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పవన్ తన ప్రసంగంలో హాస్యాన్ని జోడించి తనదైన శైలిలో అయ్యన్నపాత్రుడిని ప్రశంసించారు. దీంతో సభలో నవ్వులు పూశాయి. అసెంబ్లీలో పవన్ తొలి ప్రసంగం వీడియో మీ కోసం..

### రేపటి నుంచి లోక్ సభ సమావేశాలు

## చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ భేటీ



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 22: రేపు 24 నుంచి లోక్ సభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో... టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఏపీ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే చంద్రబాబు టీడీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. ఇప్పుడు ఎన్డీయే భాగస్వామ్య పక్షంగా టీడీపీ లోక్ సభలో అడుగుపెడుతున్నందున, సభా సమావేశాల్లో అనుసరించాల్సిన వైఖరిపై చర్చించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున 16 మంది ఎంపీలుగా గెలిచిన సంగతి తెలిసిందే. టీడీపీ పార్లమెంటరీ నేతగా ఎవరిని ఎన్నుకోవాలన్న అంశంపైనా నేటి సమావేశంలో చర్చించనున్నారు. కాగా, ఈ సమావేశానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా హాజరయ్యారు.



## రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలేదు..

### మంత్రి కోమటి రెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, నల్లగొండ, జూన్ 22: నల్లగొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజర్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలేదని, గత ప్రభుత్వాలు చేసిన రుణమాఫీ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ దేశంలో ఏ ప్రభుత్వం కూడా అమలు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు.రైతులకు సంబంధించిన ఏ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రాజీపడదని, రైతు భరోసా ఏ విధంగా చేయానే దానిపై ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. రెండు లక్షల రుణమాఫీ అందుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి కోమటిరెడ్డి. అంతేకాకుండా.. జిల్లాలో ఏ గ్రామంలో కూడా మిషన్ భగీరథ పథకం అందడం లేదని, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై..బాలకృష్ణ ప్రశంసలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22: బసవతారకం ఆసుపత్రి సేవల విస్తరణకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన వెంటనే అంగీకరించారని హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రేవంత్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. శనివారం హైదరాబాద్‌లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆసుపత్రి చైర్మన్ బాలకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందన్నారు. తన తండ్రి ఎన్టీఆర్ దూరదృష్టి కలిగిన వ్యక్తి అని... ఆ కారణంగానే మంచి ఆలోచనతో ఈ ఆసుపత్రిని నిర్మించారని పేర్కొన్నారు. నాడు బండలతో నిండిన ఈ ప్రాంతంలో బసవతారకం ఆసుపత్రిని నిర్మించారని తెలిపారు. ఇక్కడ రోగులకు మంచి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు రూ.6 కోట్లు మంజూరు చేసి... ఆసుపత్రి అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. ఇంత గొప్ప ఆసుపత్రికి తాను చైర్మన్‌గా ఉన్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ఏడు డిమాండ్లతో సీఎం రేవంత్‌రెడ్డికి.... హరీశ్‌రావు లెటర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22: కాంగ్రెస్‌ను నమ్మి అధికారంలోకి తీసుకొచ్చిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం రోడ్డున పడి అలమటించాల్సిన పరిస్థితి తెచ్చారని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. గ్రూప్ 1, డీఎస్సీ తదితర ఉద్యోగాల కోసం చేపట్టిన నియామక ప్రక్రియ కూడా ఉద్యోగార్థులకు చాలా ఇబ్బందికరంగా మారిందని హరీశ్‌రావు తెలిపారు. గ్రూప్-1 ఉద్యోగాలకు 1: 100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. గ్రూప్2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను గుర్తించి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిని కూడా వెంటనే చెల్లించాలన్నారు.గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళన, ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని ఆశించామని, కేబినెట్ సమావేశంలో వారికి న్యాయం చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందని ఎదురుచూశామని తెలిపారు. కానీ అందరి ఆశలు అడియాశలు చేసేలా, నిరాశలోకి నెట్టేసేలా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, సమస్యల గురించి ఎలాంటి చర్చ లేకుండానే కేబినెట్ సమావేశాన్ని ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వైఎస్ జగన్ కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం..

### కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందుల వెళ్తుండగా ఘటన



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 22: ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాన్వాయ్‌కి ప్రమాదం తప్పింది. కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందుల వెళు తుండగా రామరాజుపల్లి వద్ద ఆయనను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఈ క్రమంలో కాన్వాయ్‌లోని ఓ వాహన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో కాన్వాయ్‌లో ఉన్న ఫైరింజన్ వాహనాన్ని ఓ ప్రైవేట్ వెహికల్ ఢీకొట్టింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కొద్దిసేపటి తర్వాత జగన్ తిరిగి మళ్లీ పులివెందులకు బయల్దేరారు. కాగా, జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. దీనికోసం తాడేపల్లిలోని తన నివాసం నుంచి శనివారం ఉదయం 10.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరారు. అక్కడి నుంచి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందులకు కాన్వాయ్‌లో బయల్దేరారు. ఈ క్రమంలోనే ఈ ప్రమాదం జరిగింది.

## అధికారులు ఎక్కువ చేస్తే బదిలీలు ఉండవు..



### ఇక డైరెక్ట్‌గా రిమూవ్ చేయడమే : పొంగులేటి

ఇయ్యాల్టి న్యూస్, ఖమ్మం, జూన్ 22: రేషన్ కార్డ్ ఏ కాదు ఏదైనా అనర్హులైన వారు వారి అంతట వారే తప్పుకుంటే మంచిదన్నారు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. శనివారం ఆయన ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ప్రభుత్వం ధనుకులకి కాదు బీదవారి ప్రభుత్వమని, ప్రజలకి అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా అధికారులు ఎక్కువ చేస్తే నా పాలనలో ట్రాన్స్ఫర్లు ఉండవు డైరెక్టా రిమూవ్ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకి ఎంత బాధ ఉంటే మీ మీద కంప్లైంట్ చేస్తారు అది అర్థం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని ఆయన అన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోలేని వారిని ప్రభుత్వ ఉపేక్షించబోదని హెచ్చరించారు. అధికారులంతా సక్రమంగా పనిచేయాలని, కబ్జాకు గురైన వాటన్నిటిని బయటకు తీసి పేదోడికి అప్పజెప్పాలని ఆయన సూచించారు. ఇకనైనా ప్రతిపక్షాలు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని పొంగులేటి తెలిపారు. మూడేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన మాట ప్రకారం.. త్వరలోనే రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రూ.31వేల కోట్లతో రైతుల రుణాలను మాఫీ చేయనున్నామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు.

## స్పీకర్‌గా బాధ్యతలు తీసుకున్న అయ్యన్నపాత్రుడు..

### తొలి సంతకం దేనిపైనంటే ?



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 22: ఏపీ స్పీకర్ గా ఎన్నికైన అయ్యన్నపాత్రుడు తన ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈటీవీకి అనుమతి నిరాకరిస్తూ ఇచ్చిన నిబంధనల దస్త్రాన్ని కొట్టివేస్తూ తొలి సంతకం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఈటీవీకి అనుమతి నిరాకరిస్తూ నిబంధనలు విధించింది. ఈటీవీపై ఆంక్షలు తొలగించాలంటూ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. తక్షణమైన ఆంక్షలు సడలిస్తూ స్పీకర్ తొలిసంతకం చేశారు. ఈటీవీ సహా పలు ఛానళ్ల పై ఉన్న నిబంధనలను సైతం కొట్టివేశారు.16వ శాసనసభాపతిగా ఏకగ్రీవంగా అయ్యన్నపాత్రుడు ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఆయనను సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. రెండోరోజు సమావేశంలో కొత్తగా ఎన్నికైన ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రమాణం స్వీకారం చేశారు.అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1983లో టీడీపీ ఆవిర్భావం అనంతరం ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఒకసారి ఎంపీగా పనిచేశారు. పదిసార్లు నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆయన ఏడుసార్లు గెలుపొందారు. ఇప్పటివరకు ఐదు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత..



### నీట్ పరీక్ష రద్దు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 22: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాచిగూడలోని ఆయన ఇంటిని విద్యార్థి సంఘాల నేతల ఉమట్టడించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వీజేఎస్, వైజేఎస్ విద్యార్థి నాయకులు ఇయన ఇంటిలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు విద్యార్థులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. పరిస్థితి అదుపుతప్పుతుండటంతో ఎమ్మెల్సీ వెంకట్‌తోపాటు విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారు. వారిని నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నీట్ సమస్యపై కేంద్ర మంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరామని, అయినా ఆయన ఇవ్వకపోవడంతో ఇంటిని ముట్టడించామని నాయకులు తెలిపారు.

# స్విమ్మింగ్ పూల్ నుంచి బయటకు రాగానే బాలుడి మృతి!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: ఉత్తరప్రదేశ్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. స్విమ్మింగ్ పూల్‌లో అప్పటివరకూ ఈత కొట్టి బయటకొచ్చిన మరుక్షణమే టీనేజ్ బాలుడు కుప్పకూలి మరణించాడు. మీరట్‌లో వెలుగు చూసిన ఈ దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. మృతుడిని శివాల్‌ఖాస్ వాస్తవ్యుడిగా గుర్తించారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, స్విమ్మింగ్ పూల్ బయటకు రాగానే ఆ బాలుడు స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాలుడు మరణించినట్టు వైద్యులు ప్రకటించారు. స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు పరారీలో ఉండగా ఘటన నేపథ్యంలో అధికారులు దాన్ని మూసేశారు. బాలుడి మృతికి కారణమేంటో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



# కుక్కని చూడలేదని..బాయ్ ఫ్రెండ్‌పై కేసు పెట్టిన యువతి.. ఎక్కడంటే



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: ప్రేమ, పెళ్లి అనేవి మీ భాగస్వామి పట్ల పూర్తి శ్రద్ధ వహించాల్సిన సంబంధాలు. అయితే పెళ్లాం మాటని పెడచెవిన పెట్టినా పర్వాలేదు కానీ.. ప్రేయసి మాటని మాత్రం పాటించాల్సిందే అని సరదాగా కొందరు కామెంట్ చేస్తారు దీనికి ముఖ్య కారణం మీ భాగస్వామి భావాలకు ప్రేమ బంధంలో గొప్ప ప్రాముఖ్యత ఉంది. భావాలు కొంచెం గాయపడినా చాలు ఆ సంబంధం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉంది. ప్రేమకు సంబంధించిన వింత కథలు మనకు చాలాసార్లు వెలుగులోకి రావడానికి ఇదే కారణం. తాజాగా ఇలాంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. ఓ ప్రియురాలు తన ప్రియుడిని చిన్నాచితకా విషయానికి గొడవ పడి చివరకు కోర్టు మెట్లు ఎక్కించింది. ఈ ఘటన న్యూజిలాండ్‌లో చోటు చేసుకుంది. ఓ యువతి తన ప్రేమికుడు ఎయిర్‌పోర్టుకు దింపలేదని జైలుకు పంపింది. ఎయిర్ పోర్ట్ లో డ్రాఫ్ చేయని కారణంగా ఆమె ఫ్లైట్ మిస్ అయింది. మర్నాడు విమానంలో వెళ్ళడానికి అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. దీంతో ఆ యువతికి తన ప్రియుడిపై చాలా కోపం వచ్చింది. ఈ చిన్న విషయానికి ఆ యువతి తమ ఆరేళ్ల బంధాన్ని తెంచుకుంది. అంతేకాదు తాను విమాన ప్రయాణం కోసం పెట్టిన డబ్బు తిరిగి ఇప్పించమంటూ కోర్టులో తన సమస్యను లేవనెత్తింది. కోర్టులో ప్రేమికురాలు మాట్లాడుతూ.. తాను ప్రేమించిన యువకుడు తనను విమానాశ్రయానికి డ్రాప్ చేయడానికి రాలేదని న్యాయమూర్తికి తెలిపింది. నిజానికి తాను ఇంట్లో లేనప్పుడు తన కుక్కను చూసుకుంటానని అతను హామీ ఇచ్చాడు. అయితే ఆ హామీని కూడా నెరవేర్చలేదు.. అతను తన ఇంటి దరిదాపుల్లోకి వెళ్లలేదు. కనుక ఇప్పుడు తనకు పరిహారం ఇప్పించండి అంటూ కోర్టులో జడ్జికి విన్నవించుకుంది. యువతి వాదన విన్న న్యాయమూర్తి రిఫరీ క్రిస్సా కౌవీ మాట్లాడుతూ.. యువతి చెప్పిన నేరాలపై చట్టపరమైన చర్యలు తీసుకోలేరు. వాగ్దానాన్ని ఉల్లంఘించినందుకు ఎవరైనా శిక్షించబడటం అసాధ్యమని అన్నారు. అంతే కాదు ఇలాంటి చిన్న చిన్న విషయాలకే సంబంధాన్ని తెంచుకోవడం సరికాదన్నారు కోవి. అందుకే తాను యువతి పెట్టిన కేసును కొట్టివేస్తున్నానని తీర్పు ఇచ్చారు. స్టఫ్ నివేదిక ప్రకారం ఈ జంట పేర్లు తెలియాల్సి ఉంది. అయితే ఇంత జరిగిన తర్వాత ఆ ప్రిమికుడు ఆ యువతితో కలిసి జీవించడానికి ఇష్టపడడం లేదు. అందుకే కోర్టు చెప్పిన నిర్ణయంతో ఇద్దరూ నిరాశ చెందారు. అయినా వీరు బ్రేక్ కప్ చెప్పుకుని ఈ జంట విడిపోయింది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అలర్ట్..

## ఇకపై ఆఫీస్‌కు లేటుగా వస్తే జీతంలో కోత..!



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: కేంద్ర పభుత్వం ఉద్యోగులకు చేదువార్త చెప్పింది. ఇకపై ఉద్యోగులు కార్యాలయాలకు ఆలస్యంగా వస్తే ఉపేక్షించేది లేదని ఆదేశాలు జారీచేయనుంది. ఈ మేరకు త్వరలో కొత్త నిబంధనను అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. ఈ విషయాన్ని ఓ జాతీయ మీడియా సంస్థ ప్రచురించింది. కొత్త నిబంధనను త్వరలోనే అమల్లోకి తీసుకొచ్చే కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. కొత్త రూల్ ప్రకారం.. ఉద్యోగుల ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధుల్లో ఉండాలి. ఉదయం 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ సదుపాయం ఉంటుంది. ఉద్యోగి ఆ గ్రేస్ పీరియడ్ కూడా ముగిసిన తర్వాత కార్యాలయానికి వస్తే హాఫ్ డే సెలవుగా పరిగణించబడుతుంది. అయితే నెలలో రెండు రోజులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తారు. రెండు రోజులకు మించి గ్రేస్ పీరియడ్ తర్వాత ఆఫీస్‌కు వస్తే.. అదనంగా ఆలస్యం చేసే ఒక్కోరోజు హాఫ్ డే వేతనం చొప్పున కోత విధించనున్నారు. అయితే ఉద్యోగికి కాజువల్ లీవులు ఉంటే వాటి నుంచి హాఫ్ డే లీవును మినహాయించనున్నారు. కాజువల్ లీవులు లేకపోతే ఎర్న్‌డ్ లీవుల నుంచి తగ్గించనున్నారు. అవి కూడా లేకపోతే వేతనంలో కోత విధించనున్నారు. ఆలస్యంగా వచ్చే వాళ్లకు మాత్రమే కాకుండా ఎర్లీగా ఆఫీస్ నుంచి వెళ్లిపోయే వాళ్లకు కూడా ఈ నియమం వర్తిస్తుందని తెలిపారు. కాగా వేతనంలో కోత వార్తలపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తాము ఒక్కోరోజు రాత్రి 7 గంటల వరకు పనిచేస్తున్నామని, అప్పుడు తమకు అదనపు వేతనం ఇస్తలేరుగా అని ప్రశ్నిస్తున్నారు.

# సబ్బు పై కాలేయడంతో మూడో అంతస్థు మీదనుండి జారిపడ్డ మహిళ.. చివరకు..?



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: ఈ మధ్యకాలంలో ఎక్కువగా ప్రమాదవ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడం తరచుగా చూస్తూనే ఉన్నాము. తాజాగా ఇలాంటి సంఘటనకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. బెంగళూరు మహానగరంలోని డీజేహల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కనకానగర్ లో నివాసం ఉంటున్న ఓ మహిళ వారి ఇంటి పై బట్టలు ఉతికేందుకు వెళ్ళింది. అయితే ఆమె బట్టలు ఉతుకుతున్న సమయంలో పొరపాటున ఆ మహిళ ఓ సబ్బును కాలితో తొక్కింది. దాంతో ఆ మహిళ కాలుజారి బిల్డింగ్ పై నుంచి కింద పడబోయింది. అయితే అదే సమయంలో తన భర్త అక్కడే ఉండి పరిస్థితిని గమనించి వెంటనే కిందపడిపోతున్న తన భార్య చేతులను పట్టుకున్నాడు. ఆమె చేతులను పట్టుకొని పైకి లాగేందుకు ప్రయత్నం చేసినా.. పొరపాటున చేయి జారిపోవడంతో ఆ మహిళ ఒక్కసారిగా కింద పడిపోయింది. అయితే ఆ సమయంలో ఇరుగుపొరుగువారు తీసిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. మూడో అంతస్తు నుండి బాధితురాలు కింద పడటంతో ఆవిడకి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన జరిగిన తర్వాత భర్తతోపాటు ఇరుగుపొరుగువారు ఆమెను ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం ఆ మహిళ కోమాలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై డీజే హల్లి పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.



# కొరియర్ ఇలా డెలివరీ చేశాడు.. అలా వచ్చి మరీ ఎత్తుకెళ్లారు.. !

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: అమెరికాలో ఓ పార్సిల్ దొంగిలించేందుకు ఇద్దరు దొంగలు కొట్లాడుకున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. డెలివరీ వ్యాన్ వెనకే తమ కార్లలో ఫాలో అవుతూ వచ్చిన దొంగలు.. డెలివరీ బాయ్ పార్సిల్ ను ఇంటి ముందు పెట్టి వెళ్లిన మరుక్షణంలోనే దానిని కాజేశారు. అప్పటి వరకు కారులో కూర్చున్న దొంగలు రాకెట్ స్పీడ్ తో దూసుకొచ్చారు. దొంగిలించేందుకు పోటీపడి కత్తితో ఒకరు, పూలకుండీతో మరొకరు బెదిరించుకున్నారు. చివరికి ఇద్దరిలో ఒకరు ఆ పార్సిల్ ను సొంతం చేసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. ఇదంతా డోర్ బెల్ కు అమర్చిన కెమెరాలో రికార్డయింది. ఈ వీడియోను ఇంటి ఓనర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ గా మారింది. ఎక్కడ, ఎప్పుడు జరిగిందనే వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ వీడియోను పోస్ట్ చేస్తూ ఆ యజమాని వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆన్ లైన్ లో విలువైన ఫోన్లను ఆర్డర్ చేయగా.. ఆ కంపెనీ ఫెడ్ ఎక్స్ కొరియర్ కంపెనీ ద్వారా డెలివరీ చేసిందన్నారు. ఫెడ్ ఎక్స్ వ్యాన్ వచ్చి ఇంటిముందు ఆగడం, అందులో నుంచి కంపెనీ ఉద్యోగి తన పార్సిల్ ను తీసుకొచ్చి ఇంటిముందు ఉంచడం కనిపించింది. ఆ తర్వాత ఇద్దరు దొంగలు దానిని కాజేయడానికి కొట్లాడుకోవడం చూసి తనకు భయమేసిందని చెప్పాడు.

ఒకవేళ ఆ పార్సిల్ కోసం తన కుటుంబ సభ్యులు ఎవరైనా బయటకు వస్తే ఏం జరిగి ఉండేదోనని టెన్షన్ పడ్డట్లు తెలిపాడు. ఫోన్లు పోతే పోయాయ్ కానీ, ఇలా దొంగలు ఒకరిపై ఒకరు దాడికి తెగబడే ప్రయత్నం చేయడం మాత్రం ఆందోళన కలిగించిందని అన్నాడు. అసలు తాను విలువైన ఫోన్లు ఆర్డర్ చేసినట్లు ఆ దొంగలకు ఎలా తెలిసిందని, ఇందులో ఏదో తిరకాసు ఉందని అనుమానం వ్యక్తం చేశాడు.

# భార్యపై అనుమానం....ఆరేళ్ల కన్న కూతురిని చంపేసిండు ..!



ఇయ్యాల్టి న్యూస్, క్రైమ్, జూన్ 22: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కూతురుని కడతేర్చాడు. భార్యపై అనుమానంతో కన్న కూతురిని కడతేర్చాడు ఓ కసాయి. అనంతపురం జిల్లా నార్పలలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మానవత్వం మంట కలిసిన సంఘటన మూడు రోజుల క్రితం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆడుకోవడానికి బయటకు వెళ్లిన ఆరేళ్ల చిన్నారి పావని ఇంటికి రాకపోవడంతో తండ్రి గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న నార్పల పోలీసులు విచారణ చేపట్టారు. మూడు రోజుల నుంచి పోలీసులు విచారణ జరిపినా.. చిన్నారి ఆచూకీ తెలియలేదు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఒక పాడుబడిన బావిలో చిన్నారి పావని డెడ్ బాడీని పోలీసులు గుర్తించారు. చిన్నారిని ఎవరు హత్య చేశారో తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. కన్న తండ్రి కసాయిగా కూతురిని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. మూడు రోజుల నుంచి పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తు చేసినా లాభం లేకపోవడంతో.. చివరగా తండ్రి గణేష్ పై అనుమానంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో తండ్రి గణేష్ పోలీసులకు అసలు బండారం బయటపడింది. తన భార్యకు వేరొకరితో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో కూతురిని హత్య చేసినట్లు పోలీసులు ముందు ఒప్పుకున్నాడు. ఆరేళ్ల చిన్నారి పావని తనకు పుట్టలేదు అన్న అనుమానంతోనే, భార్య అమలపై కక్ష పెంచుకుని కూతురుని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. నార్పల పోలీస్ స్టేషన్ దగ్గరలో ఉన్న పాడుబడిన బావిలో ఆరేళ్ల చిన్నారిని పడేయడంతో.. నీటిలో మునిగి ఊపిరాడక చిన్నారి పావని చనిపోయింది. ఆరేళ్ల కూతురి పావని విషయంలో తరచు భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవని స్థానికులు పోలీసులకు తెలిపారు.

# భారత పర్యటనలో బంగ్లాదేశ్ ప్రధాని..

## సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య చర్చ




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో ఉన్నారు. షేక్ హసీనాతో చర్చల అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించేందుకు భారత్, బంగ్లాదేశ్‌లు అంగీకరించాయని, మొత్తం సంబంధాలను పెంపొందించేందుకు భవిష్యత్తు దృష్టిని రూపొందించుకున్నాయని చెప్పారు. బంగ్లాదేశ్ భారతదేశానికి అతిపెద్ద అభివృద్ధి భాగస్వామి అని, ఆ దేశంతో సంబంధాలకు భారత్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కొత్త రంగాలలో భారతదేశం-బంగ్లాదేశ్ సహకారానికి భవిష్యత్తు దార్శనికత సిద్ధమైందని ప్రధాని మోడీ తెలిపారు. డిజిటల్ డొమైన్, మారిటైమ్ డొమైన్, రైల్వే కనెక్టివిటీ రంగాలతో సహా విస్తృత ఆధారిత సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఇరుపక్షాలు పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రక్షణ ఉత్పత్తి, సాయుధ బలగాల ఆధునీకరణ రంగాలతో సహా రక్షణ సహకారాన్ని ప్రోత్సహించడంపై విస్తృత చర్చ జరుగుతోందని ప్రధాని తెలిపారు. ఇండో-పసిఫిక్ ఓషన్ ఇనిషియేటివ్‌లో చేరాలన్న బంగ్లాదేశ్ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అదే సమయంలో, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మాట్లాడుతూ.. భారతదేశం తమకు ప్రధాన పొరుగు దేశమన్నారు. నమ్మకమైన దేశమని.. ప్రాంతీయ భాగస్వామి అని కొనియాడారు. 1971 విముక్తి యుద్ధంతో ప్రారంభమైన భారత్‌తో సంబంధాలకు బంగ్లాదేశ్ చాలా ప్రాముఖ్యతనిస్తుంది.

# ప్రియాంక గాంధీకి మద్దతుగా.. వయనాడ్‌లో బెంగాల్ సీఎం ప్రచారం..!

ఇయ్యాల్టి న్యూస్, బెంగాల్, జూన్ 22: కాంగ్రెస్, టీఎంసీ మధ్య మళ్లీ సయోధ్య కుదిరినట్లుంది. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లోక్ సభ నుంచి బరిలోకి దిగిన ప్రియాంక గాంధీ తరఫున ప్రచారం చేసేందుకు స్వయంగా రంగంలోకి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అంగీకరించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. బెంగాల్ సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రితో కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం భేటీ అయిన తర్వాత ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. కాగా, పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి, మమతా బెనర్జీల మధ్య గత కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతుంది. రాష్ట్రంలో టీఎంసీ- కాంగ్రెస్ పొత్తు చర్చలు విఫలం కావడానికి అధీర్ రంజన్ చౌదరి కారణమని టీఎంసీ అధినేత్రి పేర్కొన్నారు. అయితే, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీ భారతీయ జనతా పార్టీపై పైచేయి సాధించింది. రాష్ట్రంలోని 42 లోక్ సభ స్థానాలకు ఏకంగా 29 స్థానాలను టీఎంసీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత అభిషేక్ బెనర్జీ.. కాంగ్రెస్ ఇండియా కూటమి నేతలతో వరుసగా భేటీ అవుతున్నారు. అనేక అంశాలపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నాలు కొనసాగించారు.




# ఇకపై 15 నిమిషాల్లో మీ ఆర్డర్ ఇంటికి వచ్చేస్తుంది..!




ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 22: ఈ రోజుల్లో ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో షాపింగ్ చేసే ట్రెండ్ బాగా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో దేశానికి చెందిన ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్ తన కస్టమర్లకు పెద్ద గిఫ్ట్ ఇవ్వబోతోంది. చాలా మంది వినియోగదారులు ఆన్‌లైన్ ఆర్డర్‌లు త్వరగా లేదా ఇచ్చిన తేదీలో డెలివరీ చేయబడలేదనే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఫ్లిప్‌కార్ట్ వచ్చే నెలలో భారీ ప్రారంభానికి సిద్ధమవుతోంది. వాస్తవానికి ఫ్లిప్‌కార్ట్ తన కొత్త సర్వీస్ 'ఫ్లిప్‌కార్ట్ మినిట్స్'ని జులై 15న ప్రారంభించవచ్చు. అంటే వినియోగదారులు చేసిన ఆర్డర్‌ను 15 నిమిషాల్లోనే వారికి అందించేలా ఫ్లిప్‌కార్ట్ ఫాస్ట్ డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ కింద, 10 వేలకు పైగా ఉత్పత్తుల జాబితాను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతుందని కంపెనీ పేర్కొంది. ఇందులో తాజా కూరగాయలు, పాల ఉత్పత్తులు, కిరాణా సామాగ్రి, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఆరోగ్య ఉత్పత్తులు, రోజువారీ అవసరాలకు సంబంధించిన అనేక ఇతర వస్తువులు ఉంటాయి. 2021 సంవత్సరం ప్రారంభంలో, కంపెనీ ఫ్లిప్‌కార్ట్ క్విక్‌ను కూడా ప్రారంభించింది,. ఇది 90 నిమిషాల డెలివరీని కలిగి ఉందని పేర్కొంది. అయితే అది విజయవంతం కాలేదు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/



# సందీప్ కిషన్‌కు జోడిగా... రీతు వర్మ..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ ఏస్‌కే30. ఈ సినిమాకు ధమకాతో బ్లాక్ బస్టర్‌ను అందుకున్న త్రినాథ రావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం రీసెంట్‌గా షూటింగ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ వచ్చింది. ఈ చిత్రంలో సందీప్‌కు జోడిగా పెళ్లి చూపులు భామ రీతు వర్మ నటించబోతున్నట్లు తెలుస్తుంది. ముందుగా ఈ చిత్రం కోసం కొత్త అమ్మాయిని అనుకున్న చివరికి రీతు వర్మకి ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్లపై వస్తున్న సినిమా ఇది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తుండగా, బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై అనీల్ సుంకర సమర్పిస్తున్నారు. ధమాకా తర్వాత రచయిత ప్రసన్న కుమార్ బెజవాడ.. ఈ సినిమాకు కూడా కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ అందిస్తున్నాడు. సందీప్ కిషన్ క్యారెక్టరైజేషన్ గత చిత్రాల కంటే డిఫరెంట్ గా ఉంటుంది. రావు రమేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు లియోన్ జేమ్స్ సంగీత దర్శకుడు.

**చూసి ముర్వాలే**

## విష్ణు ప్రియ అందాల రచ్చ.. షర్ట్ బటన్స్ విప్పేసి మరీ ఘాటుగా..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: విష్ణుప్రియ రోజురోజుకు రెచ్చిపోతుంది. తరచూ నెట్టింట గ్లామర్ ట్రీట్ ఇచ్చే ఈ భామ అందాల ప్రదర్శన మరింత పెంచేసింది. షర్ట్ బటన్స్ విప్పేసి పోరగాళ్ల హాట్ బీట్ పెంచేసింది.

## స్రవంతి చొక్కారపు సొగసుల జాతర.. బయట వానపడుతున్నా..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: పలు సినిమా, టీవీ ఇవెంట్స్‌లో ప్రత్యక్షమవుతూ బోలెడంత మంది అభిమానులను సొంతం చేసుకుంది స్రవంతి చొక్కారపు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే స్రవంతి లేటెస్ట్ గా షేర్ చేసిన ఫొటోస్ ఇవే.

## యాంకర్ శ్యామల కొత్త ఫోటోలు .. సోషల్ మీడియాలో ట్రోల్స్




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: సోషల్ మీడియాలో ట్రోల్స్ , బెదిరింపులు ఎక్కువయ్యాయంటూ ఈ మధ్య మీడియా ముందు చెప్పిన మళ్లీ సోషల్ మీడియాలో యాక్టివ్ అయింది యాంకర్ శ్యామల...రీసెంట్ గా కొన్ని ఫొటోస్ షేర్ చేసింది...

## సితార పాప లేటెస్ట్ లుక్ .. ఎంత క్యూట్‌గా ఉందంటే ..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: సూపర్ స్టార్ మహేష్ బాబు కూతురు సితార ఘట్టమనేని గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేసూపర్ స్టార్ మహేష్ బాబు కూతురు సితార ఘట్టమనేని గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు.సినిమాల్లో రాకముందే సోషల్ మీడియాలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఎక్కువే.తరచూ తన డ్యాన్స్ వీడియోలు, వెకేషన్ ఫోటోలు షేర్ చేస్తూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. అంతేకాదు అతి చిన్న వయసులోనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయేన్సర్‌గా మారింది. అలాగే తల్లిదండ్రుల బాటలోనే సేవ కార్యక్రమాలు కూడా చేస్తుంది. తన నటించి యాడ్‌కి వచ్చిన మొత్తం డబ్బుని సితార ట్రస్ట్‌కి ఇచ్చి అందరిన మనసు దోచేసింది. ఇలా వెండితెర ఎంట్రీకి ముందే సోషల్ మీడియాగా ఇన్‌ఫ్లూయేన్సర్‌గా పాపులారిటీ సంపాదించుకున్న సితారా తాజాగా తన క్యూట్ ఫోటోలు షేర్ చేసింది.

## 'కల్కి' సినిమాలో ఒక్కొక్కరికి రెమ్యునరేషన్స్ ఎంతంటే.. ? ప్రభాస్‌కి ఏకంగా..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: ప్రభాస్ కల్కి సినిమా కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ చేసిన రెండు ట్రైలర్స్ తో, సాంగ్ తో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. హాలీవుడ్ రేంజ్ లో ఈ సినిమా ఉండబోతుందని, సినిమాలో చాలా మంది స్టార్స్ ఉన్నారని మూవీ టీమ్ చెప్పడంతో ఈ సినిమాని థియేటర్స్ లో చూడటానికి ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కల్కి సినిమాని దాదాపు 400 కోట్లకు పైగా బడ్జెట్ తో తెరకెక్కించారని ముందు నుంచి చెప్తున్నారు. అయితే ఈ బడ్జెట్ లో సగం ఆర్టిస్టుల రెమ్యునరేషన్స్ కే అయిందట. కల్కి సినిమాలో ప్రభాస్ తో పాటు అమితాబ్, కమల్ హాసన్, దీపికా పదుకోన్ లాంటి స్టార్స్ తో పాటు దిశా పటాని, అన్నా బెన్, మాళవిక నాయర్, శోభన, రాజేంద్రప్రసాద్.. లాంటి స్టార్ నటీనటులు కూడా ఉన్నారు. అంతేకాకుండా మృణాల్, దుల్కర్, విజయ్ దేవరకొండ, నాని.. లాంటి చాలా మంది స్టార్స్ గెస్ట్ అప్పీరెన్స్ ఇచ్చారని టాక్ నడుస్తుంది.

అయితే కల్కి సినిమాకు ప్రభాస్ కి దాదాపు 100 కోట్లకు పైగా రెమ్యునరేషన్ ఇచ్చారంట. అలాగే అమితాబ్, కమల్, దీపికా ముగ్గురికి 15 కోట్లకు పైగా రెమ్యునరేషన్, దిశా పటానికి 5 కోట్లు ఇచ్చినట్టు సమాచారం. ఇక్కడికే 150 కోట్లకు పైగా రెమ్యునరేషన్స్ అయ్యాయి. మిగిలిన నటీనటులు, స్టార్ టెక్నిషియన్స్ తో కలిపి ఆల్మోస్ట్ 200 కోట్లు రెమ్యునరేషన్స్ కే అయిందని సమాచారం. ఆ తర్వాత గ్రాఫిక్స్ కే ఎక్కువ ఖర్చుపెట్టారట మూవీ టీమ్. ఇక ఈ సినిమా జూన్ 27న విడుదల అవుతున్న సంగతి తెలిసిందే.

## కల్కి ట్రైలర్.. రామ్‌గోపాల్ వర్మ పజిల్.. గెలిస్తే అక్షరాలా లక్ష మీదే..




ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 22: ప్రభాస్ నటించిన సినిమా కల్కి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రమోషనల్ కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఇందులో భాగంగా శుక్రవారం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్‌కు అభిమానులు, నెటిజన్లు ఫిదా అయ్యారు. విజువల్స్ గానీ, యాక్షన్ సీక్వెన్స్ అన్నీ కూడా హాలీవుడ్ లెవల్‌లో ఉన్నాయని అంటున్నారు. ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సైతం ఈ ట్రైలర్ ను చూసి ఫిదా అయ్యాడు. ప్రశంసల వర్షం కురిపించాడు. అంతేనా కల్కి ట్రైలర్‌ను ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో షేర్ చేసి ఓ పజిల్ ఇచ్చాడు. ఓ సెంటెన్స్ ఇచ్చి అందుకో కొన్ని లెటర్స్‌ను మిస్ చేశాడు. ఈ పజిల్‌ను ఎవరైతే ముందుగా ఫిల్ చేస్తారో వాళ్లకి అక్షరాలా లక్ష రూపాయలను ఇస్తానని చెప్పాడు. ఆర్‌జీవీ చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరిఇంకెందుకు ఆలస్యం మీరు ఆ పజిల్‌ను సాల్వ్ చేయగలరేమో ఓ సారి చూడండి.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838